

### వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

వన్యప్రాణులను సంరక్షించాలని నంద్యాల అటవీ శాఖ కన్జర్వేటర్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు.

- 8లో..



### ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేయాలి

ఉపాధి కల్పనే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ రాజాబాబు అన్నారు.

- 8లో..

### వాతావరణం

గరిష్టం/కనిష్టం 34 /24

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్

### పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ఒంగోలు సిటీ:** ఒంగోలులోని డీ.ఎస్.గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ (అటోనమస్), ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీఆర్‌సెట్ 2024–25) నోటిఫికేషన్ విడుదలైందని, ఈ పరీక్ష ద్వారా రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, వాటికి అనుబంధ ఉన్నత విద్యాసంస్థల్లో పీహెచ్‌డీ (డాక్టరల్ డిగ్రీ) ప్రోగ్రాంలకు ఫుల్ టైమ్, పార్ట్‌టైమ్ మోడ్‌లలో ప్రవేశాలు ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.కల్యాణి, రీసెర్చ్ కోఆర్డినేటర్ డా.ఎం.శ్రీనివాస రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కళ్యాణి మాట్లాడుతూ పరీక్షలు వచ్చే నెల 3 నుంచి 7వ తేదీ వరకు వరకు నిర్వహిస్తారన్నారు. అర్హత గల అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://సీఈటీఎస్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న డీ.ఎస్.గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు (ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రీసెర్చ్‌లో ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కాలేజీ అనుభవజ్ఞులైన పరిశోధనా మార్గదర్శకులు, లైబ్రరీ, ల్యాబ్ సదుపాయాలతో మహిళా పరిశోధకుల కోసం ఒక సురక్షితమైన, ప్రోత్సాహకరమైన అకడమిక్ వాతావరణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

### 35 ఎయిడెడ్ పాఠశాలలకు నోటీసులు జారీ

**ఒంగోలు సిటీ:** జిల్లాలో 35 ఎయిడెడ్ పాఠశాలలకు విద్యాశాఖ కమిషనర్ నోటీసులు జారీ చేసినట్లు ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్.ప్రభాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జిల్లాలో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న 17 ఎయిడెడ్ పాఠశాలలకు 30 డిసెంబర్ 2024న నోటీసులు జారీ చేశారన్నారు. ప్రస్తుతం 35 ఎయిడెడ్ పాఠశాలలకు నోటీసులు జారీ చేశారు. మొత్తం జిల్లాలో 52 ఎయిడెడ్ పాఠశాలలు ఏప్రిల్ 23, 2026 నాటికి మూతపడనున్నాయని తెలిపారు. ఈ ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేస్తామని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. అయితే జిల్లాలో ప్రస్తుతం వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు సీనియార్టీ జాబితా తయారుచేసి కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం 98 ఎయిడెడ్ పాఠశాలల్లో 106 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, 2026 ఏప్రిల్ నాటికి 46 ఎయిడెడ్ పాఠశాలలే మిగులుతాయని తెలిపారు.

### దీపావళికి జిల్లాలో 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

- కలెక్టర్ రాజాబాబు



హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ రాజాబాబు

**ఒంగోలు వన్‌టౌన్:** దీపావళి పండుగ సమయానికి జిల్లాలో 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ పీ రాజాబాబు హౌసింగ్ అధికారులను ఆదేశించారు. హౌసింగ్ అధికారులతో ప్రకాశం భవన్‌లోని తన చాంబర్‌లో బుధవారం సమీక్ష సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ స్కీములో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పీఎంఏవై, పీఎం జన్‌మన్ పథకాల కింద జిల్లాలో మంజూరైన ఇళ్లు, నిర్మాణం పూర్తయినవి, పురోగతిలో ఉన్నవి, ఇంకా ప్రారంభం కానివి, స్థానిక పరిస్థితులపై నియోజకవర్గాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ పి.శ్రీనివాస ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరాలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ పూర్తయిన నిర్మాణ దశలను బట్టి ప్రభుత్వం వెంటనే బిల్లులు విడుదల చేస్తున్నందున లబ్ధిదారులందరూ త్వరగా పూర్తి చేసుకునేలా నిరంతరం పర్యవేక్షించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాకు 8839 ఇళ్ల నిర్మాణాల టార్గెట్ ఇచ్చినట్లు పీడీ తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఈ లక్ష్యాన్ని పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, హౌసింగ్ స్కీములో ఆప్షన్ 3 కింద లబ్ధిదారులుగా ఉన్నవారికి కూడా కాంట్రాక్టర్లు త్వరగా ఇళ్లు నిర్మించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. స్పష్టమైన పురోగతి లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సమావేశంలో హౌసింగ్ ఈఈలు, డీఈఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పాతాళంలో పొగాకు ధరలు

ఈ ఏడాది పొగాకు వేలం ప్రక్రియ రైతుల పాలిట శాపంగా మారింది. వేలం ప్రారంభం నుంచి ఆశించిన ధరలు రాకపోగా వేలం చివరి దశకు చేరేకొద్దీ ధరలు మరింత పతనమవుతున్నాయి. వ్యాపారులంతా కుమ్మక్కై ఒక్కసారిగా ధరలు తగ్గిస్తుండడంతో రైతులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. కనిష్ట ధర కేజీ రూ.69 కు పడిపోవడంతో అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ ధరలు ఇంకా తగ్గుతాయంటూ ఇప్పటికే అటు వ్యాపారులు, అధికారులు కూడా రైతులకు సంకేతాలు ఇస్తున్నారు. అంతర్జాతీయ పొగాకు మార్కెట్‌ను సాకుగా చూపి ఒక్కసారిగా ధరలు తగ్గిస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.



వేలం కేంద్రంలో పొగాకు బేళ్లు

- రోజురోజుకూ దిగజారుతున్న ధరలు
- పొగాకు రైతుల ఆశలు ఆవిరి
- గరిష్ట ధర రూ.346, కనిష్ట ధర రూ.69
- 78 శాతం పొగాకు కొనుగోళ్లు పూర్తి
- మరో నెల రోజుల్లో పూర్తి కానున్న వేలం
- వచ్చే ఏడాది నుంచి పొగాకు సాగుపై ఆంక్షలు
- 158 మిలియన్ కేజీల నుంచి 90 మిలియన్ కేజీలకు తగ్గించిన పొగాకు బోర్డు

**ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పొగాకు, సరాసరి ధరల వివరాలు**

| వేలం కేంద్రం | మిలియన్ కేజీలు | సరాసరి ధర | 6.9.25 నాటి ధరలు | |
|---|---|---|---|---|
| | | | గరిష్ట ధర | కనిష్ట ధర |
| వెల్లంపల్లి-2 | 11.03 | 229.15 | 315 | 80 |
| ఒంగోలు-1 | 14.50 | 232.39 | 316 | 70 |
| ఒంగోలు-2 | 11.60 | 229.41 | 315 | 69 |
| టంగుటూరు-1 | 12.27 | 238.81 | 316 | 90 |
| కొండపి | 13.75 | 241.66 | 316 | 85 |
| బ్లాక్ సాయిల్ మొత్తం | 63.16 | 234.54 | 316 | 69 |
| పొదిలి-1 | 11.67 | 222.49 | 315 | 70 |
| కనిగిరి | 06.9 | 230.05 | 316 | 70 |
| కందుకూరు-1 | 13.76 | 246.67 | 315 | 70 |
| కందుకూరు-2 | 11.23 | 243.15 | 315 | 70 |
| కలిగిరి | 06.58 | 236.33 | 315 | 70 |
| డీసీ పల్లి | 08.94 | 230.01 | 315 | 70 |
| తేలిక రకం నేలలు మొత్తం | 58.79 | 235.64 | 316 | 70 |

**చీమకుర్తి:** పొగాకు రైతుల ఆశలు రోజురోజుకూ ఆవిరవుతున్నాయి. పొగాకు కొనుగోళ్లలో బ్రైట్ పొగాకు కేజీ ధర గరిష్ఠంగా రూ.346 పలికింది. ఇప్పుడు అది రూ.315కు పడిపోయింది. సరాసరిన రూ.234 వద్ద నిలిచింది. లోగ్రేడ్ పొగాకు మొదట్లో గరిష్ఠంగా కేజీ రూ.160- రూ.170 మధ్య పలికింది. నేడు కనిష్ఠ ధర రూ.69కు పడిపోయింది. ధరలు పెరుగుతాయేమోనని ఇన్నాళ్లు కోల్డ్‌స్టోరేజీల్లో దాచిన పొగాకును వేలం కేంద్రాల్లోకి తీసుకొచ్చి విక్రయిస్తుంటే బయ్యర్లు వేస్తున్న ధరలు చూసి రైతులు అక్కడికక్కడే కుప్పకూలే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. నాలుగేళ్ల పాటు పొగాకు రైతులకు స్వర్ణయుగంగా గడిచింది. ఈ ఏడాది మాత్రం రైతులు జీవితంలో మర్చిపోలేని విధంగా దారుణమైన ధరలు పలుకుతుండటంతో పెట్టిన పెట్టుబడులు రాక అప్పులు ఎలా తీర్చాలో, బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారాన్ని ఎలా విడిపించుకోవాలో అర్థం కాక సతమతమవుతున్నారు. లోగ్రేడ్ పొగాకు క్వింటా రూ.6 వేల నుంచి రూ.7 వేలు పలుకుతుంటే ఇక కోలుకునేది ఎక్కడని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**లోగ్రేడ్ కొనే దిక్కు లేదు...**

హైగ్రేడ్ పొగాకు ధరలు క్రమంగా తగ్గుస్తూ వస్తుండగా మరోపక్క లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేసేందుకు వ్యాపారులు అసలు ముందుకే రావడం లేదు. లోగ్రేడ్ పొగాకు కేజీ ప్రస్తుత ధర రూ.69లకు పడిపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయినా సరే లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోగ్రేడ్ బేళ్లను వేలం కేంద్రాలకు తీసురావడం.. అమ్ముడుపోక తిరిగి ఇంటికి తీసుకెళ్లడం రైతులకు పరిపాటిగా మారిపోయింది. దీని వల్ల రైతులపై రవాణా చార్జీలు, వెయిట్‌లాస్ రూపం మరింత నష్టం వస్తోంది. ఒకసారి వేలం కేంద్రానికి తీసుకురావాలంటే ఒక బేల్‌కి రూ.200ల ఖర్చవుతుండగా, శాంపిల్స్ రూపంలో బేల్‌కి ఐదారు కేజీల పొగాకును నష్టపోతున్నారు. ఇలా రెండు మూడు సార్లు వేలం కేంద్రాలకు బేళ్లను తీసుకురావడం వల్ల రైతులకు అదనపు భారంగా మారుతోంది. దీని వల్ల ప్రస్తుతం ఈ ఏడాది పొగాకు రైతులకు సాగు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.



టంగుటూరు పొగాకు వేలం కేంద్రం నుంచి నోబిడ్ బేళ్లను తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

**122 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లు పూర్తి**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మొత్తం 11 వేలం కేంద్రాల పరిధిలో మొత్తం 104.6 మిలియన్ కేజీల పొగాకును కొనుగోలు చేస్తామని బోర్డు అధికారికంగా నిర్ధారించగా రైతులు పరిమితికి మించి సాగు చేయటంతో అది కాస్త 158.6 మిలియన్ కేజీలకు పెంచింది. దానిలో ఇప్పటి వరకు 122 మిలియన్ కేజీల పొగాకు (78 శాతం)ను కొనుగోలు చేసింది. రైతుల వద్ద ఇంకా కొనుగోలు చేయాల్సిన పొగాకు 35 మిలియన్ కేజీల పొగాకు నిల్వలు ఉన్నాయి.

దానిలో భాగంగానే పొగాకు నారు మడులను నిర్వహించే రైతుల వద్ద నుంచే ఆంక్షలు మొదలు పెట్టి పొగాకు సాగును నియంత్రిస్తున్నారు. అందుకనుగుణంగానే పొగాకు నారుమడులు పెట్టుకునే వారు ముందుగానే పొగాకు బోర్డు అధికారుల వద్ద అనుమతి తీసుకొని వారు నిర్ణయించిన మేరకే పొగనారుమడులను సాగు చేయాలనే ఆంక్షలు విధిస్తున్నారు. దాంతో రైతులు ఇప్పటి నుంచి పొగాకు సాగు విస్తీర్ణం తగ్గించుకొని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని బోర్డు అధికారులు ఊరూరు తిరిగి అవగాహన కల్పిస్తున్నారు.

**158 మిలియన్ కేజీల నుంచి 90 మిలియన్ కేజీలకు తగ్గింపు**

ఈ ఏడాది ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 158 మిలియన్ కేజీల పొగాకు రైతులు సాగు చేయగా వచ్చే ఏడాది దానిని 90 మిలియన్ కేజీలకు తగ్గించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకు ఉండే గిట్టుబాటు ధరలు, పొగాకు కంపెనీల అవసరాలను బట్టి రైతులు నష్టపోకుండా ఉండాలంటే ఈ ఏడాది అనుమతినిచ్చిన 158 మిలియన్ కేజీలను వచ్చే ఏడాదికి 90 మిలియన్ కేజీలకు తగ్గించినట్లు బోర్డు అధికారులు ఇప్పటికే రైతులకు అవగాహన సదస్సులు పెట్టి వివరిస్తున్నారు. దాని ప్రకారం నల్లరేగడి నేలల పరిధిలో ఒక్కో బ్యారన్‌కు గతంలో 5.56 ఎకరాల్లో సాగుకు, 41.75 క్వింటాళ్లకు అనుమతినిచ్చేవారు. దానిని ఇప్పుడు వచ్చే ఏడాదికి 4.75 ఎకరాలకు పరిమితం చేసి 35.65 క్వింటాళ్లకు మించి ఉత్పత్తి పెంచకూడదని బోర్డు నిర్ణయించింది. తేలిక రకం నేలల్లో గతంలో 8.42 ఎకరాల్లో సాగు చేసే పరిస్థితి నుంచి 7.25 ఎకరాలకు పరిమితం చేశారు. 42.75 క్వింటాళ్ల నుంచి 36.65 క్వింటాళ్లకు పొగాకు ఉత్పత్తిని తగ్గించారు.

**లోగ్రేడ్ పొగాకు ధరలు పతనమయ్యాయి**

పొగాకు లోగ్రేడ్ రకం క్వింటా రూ.7 వేలకు పడిపోయింది. రైతులు పొగాకు మీద పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. చేసేది లేక బయ్యర్లు అడిగిన ధరకు ఇష్టమున్నా, లేకున్నా వేలం కేంద్రాల్లో రైతులు వదిలేసి పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంత కంటే అన్యాయం ఇంకొకటి లేదు.

– సూరం గురవారెడ్డి, పేర్నమిట్ట

**ఇప్పటి వరకు 122 మిలియన్ కేజీలను కొనుగోలు చేశాం**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇప్పటి వరకు 122 మిలియన్ కేజీల పొగాకును బోర్డు ద్వారా కొనుగోలు చేశాం. రైతుల వద్ద ఇంకా మరో 35 మిలియన్ కేజీల పొగాకు ఉండొచ్చు. దానిని వచ్చే నెలలోపు కొనుగోళ్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే ఏడాదికి పొగాకు ఉత్పత్తిని 90 మిలియన్ కేజీలకు పరిమితం చేశారు.

– ఎస్.రామారావు, ఆర్‌ఎం, ఒంగోలు

# ఏరులై పారుతున్న నకిలీ మద్యం

- అవన్నీ సీబీఎన్, పీకే, ఎల్కే బ్రాండ్లే
- సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజం



మేరుగు నాగార్జున

**సంతనూతలపాడు:** ప్రజలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడుస్తూనే ఉన్నారని మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో నాణ్యమైన మద్యాన్ని సరసమైన ధరలకు ఇస్తామని దేశంలో ఎక్కడా లేని వింత వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 16 నెలలుగా నకిలీ మద్యం ఏరులై పారిస్తున్నారని ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 85 లక్షల మందికి తల్లికి వందనం ఇవ్వాల్సి ఉండగా కేవలం 40 నుంచి 50 లక్షల మందికే అందజేశారని విమర్శించారు. లైసెన్సు ఉన్న డ్రైవర్లందరికీ ఆర్థిక సాయం అందజేస్తానన్న చంద్రబాబు కేవలం ఆటోలు తోలే డ్రైవర్లకు అది కూడా కోత విధించడం దారుణమన్నారు. పేదలకు ఇళ్లు కట్టి ఇస్తామని ఆశ పెట్టి అధికారంలోకి వచ్చి మాట తప్పారన్నారు. నకిలీ మద్యం సరఫరాతో చంద్రబాబు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో బూం బూం అంటూ విమర్శలు గుప్పించిన కూటమి నాయకులు ఇప్పుడు ఆ బ్రాండ్‌తో పాటు సూపర్ సిక్స్ అనే బ్రాండ్ మద్యాన్ని కూడా అమ్ముతున్నారని ఎద్దేవా చేశారు. రాయలసీమలో నకిలీ మద్యం ప్లాంట్లు రెండు బయటపడడం, వీటి వెనుక టీడీపీ కీలక నేతలే ఉండడం, ఉత్తరాంధ్ర లోనూ నకిలీ మద్యం ప్లాంట్లు ఉన్నాయని సమాచారం రావడంతో రాష్ట్రంలో మద్యం ప్రియుల వెన్నులో వణుకు పుడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తోందని ప్రజలకు అర్థమైందన్నారు. నకిలీ మద్యం ఎలా తయారు చేయాలో కూటమి నాయకులకు ఆఫ్రికాలో శిక్షణ ఇచ్చి ఆ ఫార్ములా ద్వారా నకిలీ మద్యాన్ని ప్రభుత్వ పెద్దలే ఏరులై పారిస్తున్నారని విమర్శించారు.

**మందు తాగొద్దు.. తస్మాత్ జాగ్రత్త:**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒక కలుగు నాయుడుగా మిగిలిపోయారని మేరుగు నాగార్జున ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో అరవటం, రెచ్చిపోవటం, ఊగి పోవటం, తూగిపోవటం, జుట్టు పీక్కోవటం లాంటి చేష్టలు చేసిన ఆయన ఇప్పుడు మహిళలపై ఇన్ని అఘాయిత్యాలు జరుగుతున్నా మాట్లాడకుండా కలుగులోనే ఉంటున్నారని విమర్శించారు. సొంత అన్నయ్యను బాలకృష్ణ అగౌరవపరిచినా బయటకు రాకపోవడం దారుణమన్నారు. పవన్ కళ్యాణ్ నిజస్వరూపాన్ని ఇప్పుడు ప్రజలు చూస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యం అని వ్యాఖ్యానించిన కూటమి నాయకులు ప్రస్తుతం సీబీఎన్, పీకే, ఎల్కే బ్రాండ్లు తయారు చేసి వైన్ షాపులు, బెల్టుషాపుల్లో విక్రయిస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో ప్రతి మద్యం బాటిల్‌ను డిస్టిలరీల్లోనే తయారు చేశారని, ఇప్పుడు టీడీపీ నాయకుల ఇళ్లలోనే నకిలీ మద్యం తయారవుతోందని ధ్వజమెత్తారు. మందు బాబులు ఈ మద్యం తాగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. కూటమి సర్కారు పాపాలు పండే రోజు దగ్గర్లోనే ఉందని పేర్కొన్నారు.

# సంతకాల సేకరణ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

- ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి

**ఒంగోలు సిటీ:** గ్రామస్థాయిలో జరిగే రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఈనెల 10 నుంచి నవంబరు 22 వరకు జరిగే సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణం, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలపై చర్చించారు. అక్టోబరు 28 న నియోజకవర్గాల్లో ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు. కోటి సంతకాల సేకరణ పూర్తయిన అనంతరం నవంబరు 26 గవర్నర్‌కు సమర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి కసుకుర్తి ఆదెన్న, రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శులు కె.వి.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, బొట్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో వెనక ఉన్న రాచగర్ల వెంకట్రావు



ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుండగానే జనం లేక ఖాళీ అయిన కుర్చీలు

# పదవిచ్చి..వెనక్కు నెట్టి !

- ఒంగోలు ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయాల్సిన వ్యక్తి ర్యాలీలో వెనుక వరుస

**సాక్షి టాస్క్‌ఫోర్స్:** టీడీపీ కూటమి ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తోంది. బీసీల ఓట్లు ఎక్కువగా ఉండటంతో ఏదో ఒక పదవి ఇచ్చామనిపించుకోవటమే తప్ప పదవి ఇచ్చిన తరువాత వాళ్లకు చుక్కలు కనపడేటట్లు చేస్తారు కూటమి పాలకులు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఒంగోలులో నిర్వహించారు. దక్షిణ బైపాస్ నుంచి ఉత్తర బైపాస్‌లో ఉన్న ఏ-1 ఫంక్షన్ హాలు వరకు బైక్ ర్యాలీ, ఒంగోలు ప్రధాన ట్రంకు రోడ్డులో ఊరేగింపు చేపట్టారు. కానీ ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయాల్సిన బీసీ యాదవ సామాజికవర్గానికి చెందిన రాచగర్ల వెంకట్రావుకు తీవ్ర అవమానం జరిగింది. ఊరేగింపులో ముందు వరుసలో ఉండాల్సిన వెంకట్రావును వెనక్కు నెట్టి మిగిలిన టీడీపీ నాయకులు మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహారెడ్డి, జనసేన నాయకుడు రియాజ్ తదితరులు ముందు వరుసలో ఉన్నారు. ఏ-1 ఫంక్షన్ హాలులో కూడా బీసీలకు వేదిక మీద కూడా అన్యాయమే జరిగింది. బీసీ నాయకులను వెనక్కు నెట్టి మిగిలిన వారికి ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో ప్రధాన నాయకులు మాట్లాడుతుండగానే అందరూ బయటకు వెళ్లిపోయారు. దీంతో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. యాదవ సామాజిక వర్గానికి చెందిన మంత్రి కొలుసు పార్థసారథి కూడా సమావేశానికి వస్తారని భావించినా మార్గం మధ్యలోనే ఆయన్ను అధిష్టానం వేరే సమావేశం ఉందని వెనక్కు పిలిపించినట్లు సమాచారం. అదేవిధంగా కూటమి ప్రభుత్వంలో భాగమైన ఒంగోలు బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి యానం చిన యోగయ్య యాదవ్ కు కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానం లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# 13 గంటల పనిదినాన్ని ఉపసంహరించుకోండి



ఆర్టీసీ సెంటర్లో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

- వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

**ఒంగోలు టౌన్:** చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని గంటలను 8 నుంచి 13 గంటలకు పెంచడం దుర్మార్గమని, వెంటనే 13 గంటల పనిదినాన్ని ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. పనిగంటలు పెంచుతూ ఆమోదించిన బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ బుధవారం నగరంలోని ఆర్టీసీ డిపో సెంటర్‌లో సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పని చేస్తున్న కూటమి ప్రభుత్వం కార్మికుల శ్రమశక్తిని దోచుకునే విధంగా పని గంటలను 8 నుంచి 13 గంటలకు పెంచిందని ఆరోపించారు. ఎన్నో ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని కాలరాసి తీసుకొచ్చిన పనిగంటల పెంపును మొత్తం కార్మిక లోకం వ్యతిరేకిస్తోందని చెప్పారు. కార్మికులు సాధించుకున్న 29 లేబర్ చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి అమలు చేస్తోందని, అందులో భాగంగానే 13 గంటల పనిదినాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో పట్టపగలే రక్షణ లేకుండా పోయిన నేపథ్యంలో రాత్రి పూట మహిళలతో పనులు చేయించాలనుకోవడం వివేకం అనిపించుకోదని విమర్శించారు. దీనివలన మహిళల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా వారి హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థల అనుకూల విధానాలపై కార్మికులు, ఉద్యోగులతో కలిసి ఐక్య పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.కల్పన, బాలకోటయ్య, కేఎఫ్ బాబు, కనపర్తి సుబ్బారావు, యం.రమేష్, కాలం సుబ్బారావు, చీకటి శ్రీనివాసరావు, కుమారి, శేషయ్య, కె.వెంకటేశ్వర్లు, బీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పొన్నలూరు: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చెన్నిపాడు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన మనికా తిరిపాలు (50) గ్రామానికి ఉత్తరం వైపున ఉన్న పాలేరులో చేపలు పట్టడానికి వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గం మధ్యలో పంట పొలాలకు రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటర్ తీగలను ప్రమాదవశాత్తు తిరిపాలు తగలడంతో విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయినట్లు సమాచారం. అతడిని గమనించిన కొందరు గ్రామస్తులు వెంటనే చికిత్స కోసం పొన్నలూరుకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. అయితే ఇటీవల రోడ్డు ప్రమాదంలో తిరుపాలు కుమారుడు ఉదయ్ మరణించగా, ఇప్పుడు తిరిపాలు విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో కుటుంబం కన్నీరు మున్నీరవుతోంది.

### పార్శిల్ సెంటర్ల తనిఖీ



ఒంగోలులోని పార్శిల్ సర్వీసులను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: నగరంలోని పాత మార్కెట్ సెంటర్, పాపా రైస్ మిల్, పద్మ టవర్, ఏ వన్ ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న పార్శిల్ సెంటర్లను పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సింధూ పోలీసు డాగ్‌తో ఆయా కార్యాలయాల్లోని అన్నీ రకాల పార్శిళ్లను పరిశీలించారు. అనుమానం వచ్చిన పార్శిళ్లను తెరచి తనిఖీలు చేయించారు. జిల్లాలో ఏఏ ప్రదేశాల నుంచి పార్శిళ్లు ఎక్కువగా వస్తున్నాయో, ఏ రకం పార్శిళ్లు వస్తున్నాయో కార్యాలయాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పార్శిళ్లను ఎన్ని రోజులు స్టోరేజి ఉంచుతారు, పార్శిల్ వివరాలను కంప్యూటర్లో నమోదు చేస్తున్నారా లేదా, వాటికి సంబంధించిన హార్డ్ డిస్కులు ఎక్కడ ఉంటాయనే అనే విషయాలను ఆరా తీశారు. చౌక డిపోల ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించకుండా తగిన చర్యలు తీసుకోవాలని పార్శిల్ సర్వీసుల నిర్వాహకులకు ఆదేశాలిచ్చారు. ఒకవేళ ఎవరైనా రేషన్ బియ్యాన్ని తరలించినట్లు సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను పార్శిల్ చేస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసు నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేంది లేదని స్పష్టం చేశారు. మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుధాకర్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై చెంచయ్య, స్పెషల్ పార్టీ సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

### హోం కేర్ నర్సులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

ఒంగోలు వన్‌టౌన్: హోం కేర్ నర్సులకు ఖతార్, దోహా దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌కే హైఫా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఓఎంసీఏపీ ద్వారా బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం నర్సింగ్ పూర్తి చేసిన 21 నుంచి 40 ఏళ్ల మధ్య ఉన్న వారు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. అర్హత ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న మైనారిటీ అభ్యర్థులు తమ పాస్ పోర్ట్, అనుభవానికి సంబంధించిన సర్టిఫికెట్, విద్యార్హతల సర్టిఫికెట్లతో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తులను సంబంధిత సర్టిఫికెట్లు జత పరచి ఈ నెల 12వ తేదీలోపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, కామశాస్త్రి వీధి, సంతపేట, ఒంగోలు అనే చిరునామాలో అందించాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు ఫోన్ నెం: 08592 230169, 9849901157 ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

# జ్వరాలకు భయపడాల్సిన అవసరం లేదు


వైద్యశిబిరంలో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు


మృతిచెందిన విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి వెంకటేశ్వర్లు

- జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు

కురిచేడు: ప్రస్తుత పరిస్థితుల్లో ఏ జ్వరమైనా భయపడాల్సిన పనిలేదని, అన్ని రకాల జ్వరాలకు వైద్యం అందుబాటులో ఉందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. డెంగీతో విద్యార్థిని మృతిచెందిన కురిచేడు మండలంలోని ఎస్‌ఎస్‌పీ అగ్రహారం గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. డెంగీ జ్వరంతో మరణించిన విద్యార్థిని కేసనపల్లి మధురవాణి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకుంటే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ఏఎన్‌ఎం వద్ద జ్వర పరీక్షల కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. ఎవరికి ఏ జ్వరమొచ్చినా ఇష్టం వచ్చినట్లు మందులు వాడకుండా ఏఎన్‌ఎంలనుగానీ, లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోగానీ సంప్రదించాలని కోరారు. డెంగీ జ్వరానికి కూడా మందులున్నాయని, సకాలంలో గుర్తించి సరైన చికిత్స అందిస్తే కచ్చితంగా తగ్గుతుందని అన్నారు. డెంగీ జ్వరం వచ్చిన 3 రోజుల తర్వాత పరీక్షలలో నిర్ధారణ జరుగుతుందన్నారు. రెండో రోజు డెంగీ పరీక్ష పాజిటివ్ రావడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. రక్త పరీక్ష చేసిన ల్యాబ్‌ను, వైద్యచికిత్స అందించిన వైద్యశాలను తనిఖీ చేసి మధురవాణికి వాడిన మందుల గురించి తెలుసుకున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థాయిని మించి వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడవద్దని ఆర్‌ఎంపీలను హెచ్చరించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలని, ఏ అనుమానం వచ్చినా వెంటనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీసీ అవినీతిపై విజిలెన్స్ విచారణ


సిబ్బందిని విచారిస్తున్న సీఐ అపర్ణ

దొనకొండ: గతంలో స్త్రీ శక్తి కార్యాలయంలో సీసీగా విధులు నిర్వర్తించిన ఈవీ సుచేంద్రరావు అవినీతిపై జిల్లా విజిలెన్స్ సీఐ ఎస్.ఎస్.ఎస్.అపర్ణ బుధవారం విచారణ చేపట్టారు. స్థానిక స్త్రీ శక్తి కార్యాలయంలో గ్రూపు మహిళలు, సిబ్బందితో ఆమె మాట్లాడారు. 2016 నుంచి 2019 వరకు సీసీ సుచేంద్రరావు సుమారు రూ.13 లక్షలను ఇతర అకౌంట్లకు బదిలీ చేసి స్వాహా చేశారని కేసు నమోదైంది. ఒంగోలు డీఆర్‌డీఏ వెలుగు వారు ఈ అవినీతి కేసును జిల్లా విజిలెన్స్ సీఐ అపర్ణకు అప్పగించారు. అవినీతికి పాల్పడిన వారందరికీ ఫోన్ చేసి సీఐ మాట్లాడారు. బేతేలు గ్రామ సంఘం రూ.1.46 లక్షలు, పెద్దగుడిపాడు రూ.6.36 లక్షలు, యర్రబాలెం రూ.3.10 లక్షలు, గంగదేవిపల్లి రూ.2.48 లక్షలు, బాదాపురం రూ.35 వేలు, రాగమక్కపల్లి రూ.14,500 వేలు కలిపి మొత్తం రూ.13,89,500ను సుచేంద్రరావు తనకు అనుకూలంగా ఉన్న వారి అకౌంట్లలో జమ చేసి వారి దగ్గర నుంచి తీసుకున్నట్లు సమాచారం. అంతేగాకుండా తన కుటుంబ సభ్యులైన భార్య, తల్లి అకౌంట్లలో కూడా నగదు జమచేసినట్లు రికార్డు పూర్వకంగా రుజువైందని ఆమె తెలిపారు. దీనికి బ్యాంకు వారు కూడా సహకరించినట్లు సమాచారం. ఎవరి అకౌంట్లలో జమచేశారో వారందరిపై నేరం రుజువైతే జైలుకు వెళ్లాల్సి వస్తుందని సీఐ హెచ్చరించారు. ముందుగా కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆరోపణలపై వచ్చిన సిబ్బందిని పిలిపించి మాట్లాడారు. స్థానిక కెనరా బ్యాంక్‌కు వెళ్లి పూర్తి సమాచారం తీసుకున్నారు. రూ.6 లక్షలు సుచేంద్రరావు కట్టినట్టు వివరించారు. రుద్రసముద్రంలో రేషన్ షాపును తనిఖీ చేశారు. గతంలో విధులు నిర్వహించిన ఏపీఎం మాణిక్యరావు.. సుచేంద్రరావు చేసిన అవినీతిని వెలికితీసి విచారించగా అవినీతి చేసినట్లు ఒప్పుకున్నాడు. వెంటనే జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వటంతో సుచేంద్రరావును సస్పెండ్ చేశారు

# ఉపాధి కల్పనే లక్ష్యంగా పని చేయాలి

- కలెక్టర్ రాజాబాబు


మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు వన్‌టౌన్: ఉపాధి కల్పనే లక్ష్యంగా సంబంధిత శాఖలు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పీ రాజాబాబు అధికారులను ఆదేశించారు. నైపుణ్య అభివృద్ధి, ఉపాధి కల్పనపై బుధవారం ప్రకాశం భవనంలోని తన చాంబర్లో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పరిస్థితులకు అనుగుణంగా యువతకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి కల్పించి ఉపాధి మార్గం చూపించాలన్నారు. సెర్ప్, మెప్మా, నైపుణ్యాభివృద్ధి విభాగాలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు మరింత చురుకైన పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. సెర్ప్, మెప్మా పొదుపు సంఘాలలోని మహిళలు ఇప్పటికే జీవనోపాధి కోసం వివిధ వృత్తులు చేస్తున్నారని, వారికి అవసరమైన నైపుణ్యాభివృద్ధిని కల్పించడం ద్వారా వారి వద్ద మరింత మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పొదుపు సంఘాల మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. రెండు గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని సంయుక్తంగా మినీ డైరీ ఫారాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా మెప్మా ద్వారా ఉపాధి కల్పిస్తున్న, భవిష్యత్తు అవకాశాలను తెలుపుతున్న బ్రోచర్‌ను సమావేశంలో కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ నారాయణ, మెప్మా పీడీ శ్రీహరి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి రవితేజ, ఉపాధి కల్పన అధికారి రమాదేవి, రూడ్ సెట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, జెడ్పీ సీఈవో చిరంజీవి, డీపీఓ వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఇన్చార్జి రజనీ కుమారి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా పశుసంవర్ధక అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

- నంద్యాల ఫారెస్టు కన్జర్వేటర్ విజయకుమార్


వన్యప్రాణుల వేషధారణలో ఉన్న చిన్నారులతో అటవీశాఖ అధికారులు

మార్కాపురం: వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నంద్యాల అటవీశాఖ కన్జర్వేటర్ సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి విజయ్‌కుమార్, సబ్‌కలెక్టర్ త్రివినాగ్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా బుధవారం మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ రవూఫ్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం అనంతరం, ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి బాగుండాలంటే అడవులను సంరక్షించుకోవాలని, వాటితోపాటు అందులో జీవించే వివిధ రకాల వన్యప్రాణులను కూడా కాపాడినప్పుడే ప్రకృతి సమతుల్యత బాగుంటుందని అన్నారు. అవగాహన లేక పలువురు అటవీ ప్రాంతంలోకి వేటకు వెళ్లి వన్యప్రాణులను చంపుతున్నారని, ఇది సహించరాని నేరమని అన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద జైలుకు పంపుతామని హెచ్చరించారు. మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రవూఫ్ మాట్లాడుతూ నల్లమల అటవీ ప్రాంతంలో పెద్దపులులు, చిరుతలు, జింకలు, ఎలుగుబంట్లు, దుప్పులు, నెమళ్లు పలురకాల వన్యప్రాణులు ఉన్నాయని, ఇవి పొరపాటున జనావాసాల్లోనికి వస్తే వాటిపై రాళ్లు విసిరి చంపకుండా తమకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణపై పలువురు విద్యార్థినులు మాట్లాడారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వన్యప్రాణులను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గిద్దలూరు, నంద్యాల అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్లు నిషాకుమారి, అనురాగ్ మీనా, మార్కాపురం డీఎస్పీ డాక్టర్ నాగరాజు, శ్రీశైలం, నంద్యాల సబ్‌డీఎఫ్‌ఓలు బాలరాజు, భవిత కుమారి, ఎఫ్ఆర్ఓ పిచ్చిరెడ్డి, డీఆర్ఓ నాగరాజు గౌడ్, హెచ్‌ఎం శ్రీదేవీ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: క్యాన్సర్ వ్యాధిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిదని, మెరుగైన వైద్యం అందించేందుకు తోడ్పడుతుందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక వైద్య శాఖ కార్యాలయంలో ఆశా, ఏఎన్‌ఎంలకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ క్యాన్సర్ అనుమానిత కేసులను వెంటనే వైద్యాధికారికి రెఫర్ చేయాలని ఆదేశించారు. వైద్యాధికారి సదరు కేసులను జీజీహెచ్‌లోని ప్రివెంటివ్ అంకాలజీ విభాగానికి చెందిన రూం నంబర్ 222కు రెఫర్ చేయాలని సూచించారు. రొమ్ము క్యాన్సర్ అవగాహన నెలను పురస్కరించుకొని రొమ్ము క్యాన్సర్ స్వీయ పరీక్షలపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, కమ్యూనిటీ కేంద్రాల్లో ఆరోగ్య చర్చలు, సమావేశాలు నిర్వహించడం ద్వారా క్యాన్సర్‌పై తగిన పరిజ్ఞానాన్ని పెంపొందించాలని చెప్పారు. బ్యానర్లు, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ముందస్తు గుర్తింపు ప్రాణాలను కాపాడుతుందనే నినాదాలతో అవగాహనా శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్వజన ఆస్పత్రి వైద్యులు భగీరథి, ఎన్‌సీడీ సీడీ నోడల్ డాక్టర్ కమలశ్రీ, డాక్టర్ నళిని, డాక్టర్ వాణిశ్రీ, హెచ్‌సీజీ క్యాన్సర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

### అర్హత ఉన్న ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం


అధికారులతో సమీక్షిస్తున్న షేక్ ఇబ్రహీం షరీఫ్

ఒంగోలు: విచారణలో ఉన్న, అర్హత ఉన్న ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. బుధవారం విచారణలో ఉన్న ఖైదీల విషయాలపై స్థానిక తన చాంబరులో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయస్థానాల్లో తమ కేసులు నడిపించుకునేందుకు న్యాయవాదిని నియమించుకోలేని ప్రతి ఖైదీకి ఉచితంగా న్యాయవాదిని నియమించి వారికి న్యాయ సహాయం అందిస్తామన్నారు. రెవెన్యూశాఖ, పోలీసుశాఖ, జైళ్ల శాఖల అధికారులు సమన్వయంగా వ్యవహరించి చట్టపరంగా సమస్యలు పరిష్కారానికి విచారణ ఖైదీలకు సహకరించాలన్నారు. ఆర్‌డీవో సీహెచ్ ఓబులేసు, సీఐలు మల్లిఖార్జునరావు, దేవ ప్రభాకర్, జైలు శాఖ అధికారులు శ్రీనివాసరావు, యలమందరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వన్య మృగం దాడిలో మేక మృతి

గిద్దలూరు రూరల్: వన్యమృగం దాడి చేయడంతో మేక మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారు జామున మండలంలోని దిగువమెట్ట తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలుగుచూసింది. వివరాలు.. గ్రామానికి చెందిన ఎస్.కృష్ణానాయక్‌కు చెందిన మేకల గుంపు మీద గుర్తుతెలియని వన్య మృగం దాడికి పాల్పడింది. ఒక మేకను నోటకరుచుకుని గుంపులో నుంచి వేరుచేసి అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి చంపింది. మేక శరీర భాగాన్ని కొంత తినేసి మిగిలింది అక్కడే వదిలేసింది. బుధవారం ఉదయం కృష్ణానాయక్ తన మేకల గుంపులో ఒకటి తగ్గడాన్ని గమనించి తండా సమీపంలో వెతకగా కళేబరాన్ని కనిపించింది. మేకను చిరుతపులి చంపి ఉండవచ్చని తండా వాసులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మేకను చంపింది చిరుతపులి అని నిర్ధారించలేమని, కుక్కలు లేదా ఇతర వన్యమృగాలు దాడి చేసి చంపి ఉండవచ్చని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ట్రాప్ కెమెరాల ఫుటేజీ పరిశీలించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. కాగా దిగువమెట్ట తండా అటవీ ప్రాంతంలో గత మూడు రోజుల నుంచి చిరుతపులి సంచరిస్తోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

# ఆగి ఉన్న కూలీల ఆటోను ఢీకొన్న కారు


తీవ్రంగా గాయపడ్డ చిట్యాల సరస్వతి


ప్రమాదంలో గాయపడ్డ ఒడిచర్ల కృష్ణారెడ్డి


ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

- ఆటో డ్రైవర్‌తో పాటు ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు

పెద్దదోర్నాల: కూలీలను ఎక్కించుకునేందుకు రోడ్డుపై ఆగి ఉన్న ఆటోను వేగంగా వస్తున్న ఇన్నోవా కారు ఢీకొట్టింది. ఈ సంఘటన బుధవారం మండల పరిధిలోని యడవల్లి తిరమలనాథ స్వామి కొండ వద్ద చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ ఒడిచర్ల కృష్ణారెడ్డితో పాటు ఆటోలో ఎక్కుతున్న చిట్యాల సరస్వతి, అల్లు నారాయణమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు ఐనముక్కలకు చెందిన వ్యవసాయ కూలీలు కొందరు యడవల్లి వద్ద జరుగుతున్న వ్యవసాయ పనుల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో పనుల్లో పాల్గొన్న వ్యవసాయ కూలీలను తీసుకొచ్చేందుకు ఐనముక్కలకు చెందిన ఓ ఆటో యడవల్లి వద్ద ఉన్న తిరుమలనాథ స్వామి ఆలయం వద్ద రోడ్డుపై ఆగింది. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ కృష్ణారెడ్డితో పాటు మరి కొందరు వ్యవసాయ కూలీలు ఆటోలో ఎక్కే సమయంలో వేగంగా వస్తున్న కర్నాటకకు చెందిన ఇన్నోవా కారు ఢీకొనటంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను స్థానికులు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిట్యాల సరస్వతి, ఒడిచర్ల కృష్ణారెడ్డిలను మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు రెఫర్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అదుపు తప్పి బోల్తాపడిన లోడు లారీ

పెద్దదోర్నాల: అదుపు తప్పిన ఓ లోడు లారీ కర్నూలు, గుంటూరు జాతీయ రహదారిలోని మూల మలుపులో బోల్తా పడింది. ఈ సంఘటన బుధవారం జాతీయ రహదారిలోని ప్రసాద్ లారీ కాటా వద్ద చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాల మేరకు బెంగళూరు నుంచి క్యాబేజీ లోడుతో భువనేశ్వర్‌కు వెళ్తున్న లోడు లారీ మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్డును దాటిన వెంటనే జాతీయ రహదారిలోని మూలమలుపు వద్ద అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. దీంతో బోల్తా పడిన లారీలో ఉన్న క్యాబేజీ లోడును మరో లారీలో లోడు చేసి రోడ్డుపై అడ్డంగా ఉన్న లారీని తొలగించారు. రహదారి నిర్మాణంలో ఇంజినీరింగ్ లోపాలు ఉండటంతోనే ప్రమాదం జరిగిందని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.

# ఇద్దరు వేటగాళ్లు అరెస్టు


పట్టుబడిన వేటగాళ్లతో అటవీశాఖ అధికారులు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని సంద్రపాడు బీటు అభయారణ్యంలో వన్యప్రాణులను వేటాడేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను గిద్దలూరు రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి అరెస్టు చేశారు. మండలంలోని కె.బయనపల్లె గ్రామానికి చెందిన మన్నెం రంగయ్య, దిగువమెట్ట గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు నాటుతుపాకీతో అభయారణ్యం ప్రాంతంలో తిరుగుతున్నట్లు మంగళవారం అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాజశేఖర్, ఎఫ్‌బీఓలు చంద్రశేఖర్‌రెడ్డి, చాంద్‌బాషలు అడవిలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో వేటాడేందుకు తుపాకీ చేతిలో ఉన్న ఇద్దరు వారి కంటపడ్డారు. అనుమానం వచ్చి వారిని అదుపులోనికి తీసుకుని విచారించగా వన్యప్రాణులను వేటాడేందుకు అడవిలోకి వచ్చినట్లు తెలిపారు. దీంతో వారి వద్ద ఉన్న నాటు తుపాకీని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు.

# క్విస్‌లో అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభం

- సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, ఇస్రో సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ


ప్రాజెక్టులు పరిశీలిస్తున్న పద్మకుమార్, ముత్తుచెరియన్, వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి గాయత్రిదేవి

ఒంగోలు సిటీ: శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ , ఇస్రో, క్విస్ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి షార్ డైరెక్టర్ పద్మకుమార్, అసోసియేట్ డైరెక్టర్ ముత్తుచెరియన్, క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి గాయత్రి దేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ పద్మకుమార్ విద్యార్థులకు షార్, ఇస్రో పనితీరును వివరించారు. రాకెట్ లాంచింగ్ ఏ విధంగా ప్రారంభమైందో వివరించారు. రానున్న కాలంలో ఇస్రో మరిన్ని ప్రయోగాలు చేస్తోందని, దానికి అంతర్జాతీయంగా ప్రతి ఒక్కరూ సహకరిస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది లివ్ ఇన్ స్పేస్ కాన్సెప్ట్‌తో వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, స్పేస్ ట్రావెల్ ఎలా ఉంటుంది? స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన విషయాలను సామాన్యులకు తెలిసే విధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అసోసియేట్ డైరెక్టర్ ముత్తుచెరియన్ మాట్లాడుతూ షార్, ఇస్రో ఇప్పటికే ఎన్నో అద్భుతమైన ప్రయోగాలు చేసిందన్నారు. దాంట్లో భాగంగానే ఇప్పటికే డిజాస్టర్ మేనేజ్మెంట్ తదితర అంశాల్లో తమ టెక్నాలజీని వాడుతున్నారన్నారు. ఓషన్ టెక్నాలజీలో సైతం ప్రయోగాలు చేస్తున్నట్లు చెప్పారు.

**అలరించిన అంతరిక్ష ప్రదర్శన...**

అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దాదాపు 2000 మంది విద్యార్థులు ప్రదర్శనను వీక్షించారు. క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, డీపీఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, సీఎస్ సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్, వరల్డ్ స్పేస్ వీక్ – 2025 ఒంగోల్ సబ్ కమిటీ చైర్మన్ లీలా నాగ శ్రీనివాసరావు, మెంబర్ సెక్రటరీ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

### గుండ్లకమ్మకు వరద ఉధృతి


గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి నదిలోకి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

మద్దిపాడు: మండలంలోని కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ జలాశయానికి వరద నీరు ఉధృతంగా చేరుతోంది. గిద్దలూరు, వినుకొండ తదితర గుండ్లకమ్మ ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల నేపథ్యంలో మార్కెళ్ల వద్ద ఉన్న ఈదర వాగు, తాళ్లూరు మండలంలోని దోర్నపు వాగు, చిలకలేర్లు ఉధృతంగా ప్రవహిస్తూ గుండ్లకమ్మ నదిలో కలుస్తున్నాయి. దీంతో బుధవారం తెల్లవారుజామున గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు వరద నీరు భారీగా చేరింది. దీంతో రిజర్వాయర్ గేట్లు ఎత్తి బయటకు విడుదల చేశారు. రిజర్వాయర్‌లోకి 12 వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా ఆరు గేట్ల ద్వారా 12 వేల కూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ రామాంజనేయులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్ నీటి మట్టం 24 మీటర్ల వద్ద నీటిని నిల్వ ఉంచినట్లు చెప్పారు. వరద ఉధృతి కొనసాగితే ఎక్కువ గేట్లను తెరిచి నీటిని విడుదల చేస్తామన్నారు.